మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి, కలెక్టర్ తదితరులు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 13, ప్రభాతవార్త:** సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో ఈనెల18న నిర్వహించనున్న యువజన ఉత్సవాల పోస్టర్‌ను మెదక్ ఎంపి రఘునందన్‌రావు, జిల్లాకలెక్టర్ హైమావతి చేతుల మీదుగా గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్‌డిఎపిడి జయదేవ్ అర్య, జిల్లా క్రీడలు,యువజన అధికారి వెంకటనర్సయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్ వాచ్‌మెన్ తొలగింపు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 13 ప్రభాతవార్త :** విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్ (ఇస్మాయిల్‌ఖాన్‌పేట ఎస్సీ,ఎస్టీ) వాచ్మెన్ శేఖర్‌ను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఉత్తర్వులు జారీ చేశారు. అతనిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నివేదిక ఆధారంగా వాచ్మెన్ శేఖరర్‌ను తొలగిస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ అందించిన వివరాల ప్రకారం, నవంబర్ 12 రాత్రి హాస్టల్ వాచ్‌మెన్ శేఖర్ మద్యం తాగి వండిన అన్నం గిన్నెలో కాళ్లు పెట్టిన ఘటన చోటుచేసుకుంది. సంగారెడ్డి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జానకిదేవి ఇచ్చిన రిపోర్టు ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘటనకు బాధ్యుడైన వాచ్‌మెన్ శేఖర్‌ను విధుల నుండి తొలగించడం జరిగిందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే కాంట్రాక్టర్‌కు హెచ్చరిక జారీచేశారు. ప్రతిరోజు హాస్టల్ పర్యవేక్షణకు ఒక ఉపాధ్యాయుని ప్రత్యేకంగా ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌ను తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వసతి గృహాలను పర్యవేక్షించాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.


మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి

## ఇంటర్ బోర్డులో సమగ్ర మార్పులు

### జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 13, ప్రభాతవార్త :** అధ్యాపకుల చిత్త శుద్ధితోనే ఇంటర్ కళాశాలల అభివృద్ధి జరుగుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ మీడియట్ బోర్డులో సమగ్ర మార్పులకు శ్రీకారం చుట్టిందని, ముఖ్యంగా విద్యార్థులు, అధ్యాపకుల ముఖ ఆధారిత అటెండెన్స్‌తోపాటు ప్రతీ శని వారం హెల్ప్ ప్రోగ్రామ్, క్రీడా పోటీలు నిర్వహించడం, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేక శ్రద్ధ వహించడంలాంటి కార్యక్రమాలు జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లా నుండి వచ్చే ఇంటర్ ఫలితాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచడానికి అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఇంటర్ విద్య బలోపేతానికై బోర్డు కమిషనర్ అనేక ఆర్థిక వనరులను ప్రతి కళాశాలకు అందేటట్లు చేస్తున్నారని, ఇటీవలే 60 కోట్ల రూపాయలను కళాశాలల అభివృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వచ్చిన నిధులతో ప్రతి క్లాస్ రూములో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి హైదరాబాదులో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి 430 కళాశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ముందంజలో ఉండడానికి అధ్యాపకులే వెన్నుముకలాంటివాళ్ళని, వారు చిత్తశుద్ధితో పని చేస్తే ఫలితం తప్పకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లలితతో పాటు తదితరులు ఉన్నారు.

## నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకుంటాం

### - ఎస్‌పి పరితోష్ పంకజ్


మాట్లాడుతున్న ఎస్‌పి పరితోష్ పంకజ్

**జహీరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** నిషేధిత, ప్రభుత్వ ఆదాయానికి గండికట్టే అక్రమ రవాణాను అడ్డుకుంటామని, ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ అన్నారు. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగిన జహీరాబాద్ ప్రాంతం గుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన వస్తువులను అక్రమంగా రావాణా కాకుండా చూస్తామన్నారు. ప్రజల శాంతి భద్రతల రక్షణలో భాగంగా అంతర్ రాష్ట్ర నేరస్తుల, పేలుడు స్వభావంగల మందుగుండు సామాగ్రి, గంజాయి, అక్రమ మద్యం, గుట్కా, పిడిఎస్ బియ్యం రవాణా కాకుండా చర్యలు తీసుకునేందుకు వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. బుధవారం రాత్రి 9 గంటల నుంచి 1.30 గంటల వరకు జాతీయరహదారిపై వెళుతున్న ప్రతి వాహనాన్ని 80 మంది పోలీసు సిబ్బంది బృందాలుగా విడిపోయి 850 వాహనాలను ఆపి తనిఖీ చేశామన్నారు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్నిస్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 9 మందిపై డిడి కేసులు నమోదుచేశామన్నారు. వాహనాల తనిఖీలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, జహీరాబాద్ డిఎస్‌పి సైదానాయక్, పట్టణ సిఐ శివలింగం, బొల్లారం సిఐ రవీందర్‌రెడ్డి, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, సదాశివపేట సిఐవెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి కార్యదర్శిని సన్మానించిన సెట్విన్ చైర్మన్


ఏఐసీసీ కార్యదర్శి కుసుమకుమార్‌ను సన్మానిస్తున్న గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** ఏఐసిసి కార్యదర్శిగా, ఒడిశా రాష్ట్రకాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జిగా నియమితులైన జెట్టి కుసుమ కుమార్‌ను గురువారం కుసుమకుమార్ నివాసంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనరెడ్డి తదితరులు ఉన్నారు.

## నాచగిరిలో కార్తీక దీపోత్సవం

**వర్గల్, నవంబరు 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమం గురువారం 22వ రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రమిదలను మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు.


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

### విధులకు డుమ్మా కొడుతున్న డాక్టర్ల నుంచి

## జీతం డబ్బులు రికవరీ చేయాలి

- ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద దళారులు లేకుండా కఠినంగా వ్యవహరించాలి
- అభివృద్ధి నిధులు మంజూరు చేసినా ప్రారంభం కాని పనులు
- మెదక్ ఎంపి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు హాజరు కాకుండా దుమ్మా కొడుతున్న వైద్యులు నెల నెల వేతనాలు తీసు కుంటున్నారని వెంటనే వారి నుంచి తీసుకున్న జీతం డబ్బులు రికవరీ చేయాలని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు డిసిహెచ్‌సి అన్నపూర్ణను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి కో-ఆర్డినేషన్ అండ్ మానటరింగ్ కమిటీ(దిశా) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసు పత్రుల వద్ద దళారులు లేకుండా కఠినంగా వ్యవహారించాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయినా తర్వాత అసుపత్రికి వచ్చిన నిధుల వివరాలను అందిం చాలని ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, నిఘా పెట్టాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ. పార్కింగ్ స్థలాలు లేకుండా నిర్వహిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్‌ను ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో రేటు చార్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లక్ష మందికి పైగా కార్మికులుఉంటే ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేస్తారని వివరాలు అందిస్తే ఆసు పత్రి మంజూరుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గత ఎంపిలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తే ఇప్పటివరకు పనులు ప్రారంభించకుండా ప్రారంభించిన పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఏమిటని సంబంధితశాఖ అధికారులను ప్రశ్నించారు. తాను ఎంపిగా గెలిచిన తర్వాత జిల్లాలో 44 అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తే 16 పనులు మాత్రమే పూర్తిచేశారని మిగతా పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో ఎంపిలు, ప్రస్తుత ఎంపిగా తాను అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తే పనులు మాత్రం సకాలంలో ప్రారంభించకుండా, ప్రారంభించిన పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు... ఏమైనా రాజీవ్ రహదారి నిర్మిస్తున్నారా లేక ఎయిర్ పోర్టు కడుతున్నార అని ప్రశ్నించారు. 16వ, 17వ లోక్‌సభ నిధుల పనులు పెండింగ్‌లో పెట్టడం సరి కాదని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. 2019-20లో ఎంపి నిధుల నుంచి మంజూరైన పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. దుబ్బాక రామసముద్రం చెరువు అభివృద్ధికి ఎన్నినిధులు వచ్చాయి ? ఎన్ని ఖర్చుచేశారో వివరాలను అదించాలని లేదంటే విజిలెన్స్ విచారణ చేయాల్సి వస్తుందన్నారు. దుబ్బాకలోని కెసిఆర్ స్కూల్‌ను రూ.15 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తే 350 మంది విద్యార్థులు ఉండడం సరి కాదని విద్యార్థుల సంఖ్య పెంచాలని డిఈఓను ఆదేశించారు. నేషనల్ హైవే నిర్మాణ అధికారులు జాతీయ రహదారి నిర్మాణం పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఇబ్బందులకు గురిచేస్తే రైతుల అగ్రహానికి గురికావాల్సి వస్తుందని సూచించారు. ఇప్పటికే రైతులు రిజర్వాయర్ల, కాల్వల నిర్మాణాలలో భూములు కోల్పోయి ఇబ్బందులో ఉన్నారని గుర్తు చేశారు. ధాన్యం దిగుమతిలో మిల్లర్లు రైతులను తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలులో తేమ శాతం పేరిట రైతులను మిల్లుల యజమానులు ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలన్నారు.డ్రాగన్ ఫ్రూట్, అవకాడోలాంటి పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని సంబంధితశాఖ అధికారులకు సూచించారు. చేప పిల్లలను ఇతర రాష్ట్రాలు,జిల్లాల నుంచి తీసుకవచ్చి పంపిణీ చేస్తున్నారని ఇక్కడే చేప పిల్లల పెంపకం కోసం కేంద్రాలను ఏర్పాటు చేయ దానికి స్థలాలను గుర్తించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అధికారులెవరూ ప్రొటోకాల్ పాటివడం లేదని పద్దతి మార్చుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కమిషనర్ పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్‌డిఎ పిడి జయదేవ్‌అర్యా, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


హుస్నాబాద్‌లో ధర్మపోరాట దీక్ష దృశ్యం

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 13, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బిసి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బిసి సంఘాల నాయకులు అఖిలపక్ష నాయకులతో కలిసి హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాజ్యాంగాన్ని సవరణ చేసి, బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. నిర్వహించిన ఈ దీక్ష బిసి జెఎసి పిలుపు మేరకు నిర్వహించడం జరిగిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అత్యదిక జనాభా కలిగిన బిసిల రిజర్వేషన్‌ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, రాష్ట్రంలో జనాభా ప్రకారం తమకు అందల్సిన రిజర్వేషన్‌ల విషయం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ రిజర్వేషన్‌ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సినంత చేసిందని, ఇప్పుడు కేంద్రం దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ దీక్షలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, సిపిఐ, బిఎస్‌పి పార్టీలతో పాటు హుస్నాబాద్ జెఎసి జెఎసి, మాలమహానాడు, జనజాగృతి కళాసమితి, బీసీ కుల సంఘాలు పాల్గొన్నాయి.

ఈ దీక్షకు జెఎసి కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షత వహించగా దీక్షలో సిద్దిపేట జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో ఛైర్మన్ బోలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్, మాజీఎంపిపి ఆకుల వెంకన్న, బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అన్వర్, బిఎస్‌పి నియోజకవర్గం అధ్యక్షులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, ఓయూ జెఎసీ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, మాలమహానాడు నాయకులు వెన్న రాజు, ఆరె కిషోర్, నోముల బాలయ్య, హాసన్, పచ్చిమట్ల శ్రీకాంత్, శివ, బొల్లి శ్రీనివాస్, కేశవేణి రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### నూతన లేబర్ పాలసీని

## ఉపసంహరించుకోవాలి

### -సిఐటియు జిల్లా అధ్యక్షుడు వీర మల్లేశం

**జహీరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి)ని వెంటనే సమావేశపర్చాలని, కార్మిక వర్గానికి వ్యతిరేకమైన శ్రమ శక్తి నీతి 2025 నూతన లేబర్ పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వీర మల్లేశం కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ శ్రామిక భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూదన లేబర్ పాలసీ-కార్మిక వర్గంపై దాడి అంశంపై సెమినార్ నిర్వహించగా కార్యక్రమానికి వీర మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిన లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకే నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి-2025ను తెస్తోందన్నారు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉన్న పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 19 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్స్‌గా మార్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సిఐటియు దేశంలోని కార్మిక సంఘాలన్నింటిని ఏకం చేసి దేశ వ్యాప్త సమ్మె చేయడంలో అమలు చేయకుండా వెనుకడుగు వేసిందని గుర్తు చేశారు. దేశంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం తప్పఅనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతున్నాయన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్‌ను కేరళ రాష్ట్రంలో అమలు చేయమని అక్కడి వామపక్ష ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సెమినార్‌లో సిఐటియు జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్ మహిపాల్, ఆయా యూనియన్‌ల సిఐటియు నాయకులు నర్సయ్య,నరేష్, మహేశ్వర్,నందమ్మ, యశోదా, సందీప్‌రెడ్డి, నారాయణ, బక్కన్న, వంశీ, బాలరాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వీర మల్లేశం

## శ్రమశక్తి నీతి 2025 రాజ్యాంగ విరుద్ధం

### సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

**పటాన్‌చెరు, నవంబరు 13, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి 2025 రాజ్యాంగ విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రమశక్తి నీతి2025 సెమినార్‌కి చుక్కా రాములు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చుక్కా రాములు మాట్లాడుతూ,ఈ లేబర్ పాలసీతో కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర జరుగుతున్నదని, సమిష్టి బేరసారాల హక్కును హరించి, ఐఎల్‌ఓను బైపాస్ చేసి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఈ పాలసీ తెచ్చారని ఆరోపించారు. దేశంలో కార్మికశక్తిని ఐక్యం కానీయకుండా కార్పొరేట్ల రాజ్యంలా మార్చడానికి ఈ శ్రమశక్తి నీతి 2025 ఉపయోగపడుతుందని, మన రాజ్యాంగంలో కార్మికులకు కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమకు గౌరవంవంటి విలువలకు పూర్తి విరుద్ధమని, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి మూల కారణమైన కార్మికవర్గ హక్కులపై యూనియన్లతో చర్చించకుండా ఏకపక్షంగా అమలుచేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ పాలసీని కేంద్ర ప్రభుత్వం రద్దుచేయాలని, ఈ అంశంపై కార్మికవర్గం ఐక్యమై పోరాటాలకు సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పి.పాండురంగా రెడ్డి, ఎం.మనోహర్, ఎ.వీరారావు, ఎం.సత్తిబాబు, వివిధ కమిటీల సభ్యులు, మాజీ ఆఫీస్ బేరర్స్, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో మొదటిసారిగా క్యాన్సర్‌గడ్డ ఆపరేషన్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 13, ప్రభాతవార్త :** సురభి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం మొట్టమొదటి సారిగా సిద్దిపేటలో మెదడకు సంబంధించిన క్యాన్సర్‌గడ్డ ఆపరేషన్ చేశారు. నంగునూర్ మండలం నర్మెటకు చెందిన ఎల్లవ్వ(70) యేండ్ల వృద్ధురాలికి రాజీవ్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా సర్జరీ నిర్వహించారు. సర్జరీ తర్వాత పేషంట్ క్షేమంగా ఉన్నారని డాక్టర్లు డతెలిపారు. డాక్టర్ హాజి పవర్ షాదిఖ్ అబ్బాస్ ఆధ్వర్యంలో వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. మొదటి సారిగా మెదడకు సంబంధించిన క్యాన్సర్ గడ్డ ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ అబ్బాస్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గోరకంటి దీప్తిరావు అభినందించారు. బాధిత కుటుంబీకులు ఆపరేషన్ నిర్వహించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**జహీరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** వ్యవసాయ పొలం వద్ద కూలి పనులు చేసుకుంటుండగా విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు మృతి చెందిన సంఘటన కోహిర్ మండలం మనియార్‌పల్లిలో బుధ వారం జరిగింది. కోహిర్ ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం... కోహిర్ పట్టణానికి చెందిన సయ్యద్ సల్మాన్(28) బుధవారం సాయంత్రం మనియార్‌పల్లి గ్రామంలోని సుభాష్‌రెడ్డి ఫామ్ హౌజ్‌లో పనిచేసేందుకు మోయిజ్‌తో కలిపి ఫామ్‌హౌజ్‌లో పనిచేస్తున్న తరుణంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద గల గడ్డిని తీసే క్రమంలోసయ్యద్ సల్మాన్ ప్రమాదావశాస్తు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన సుభాష్‌రెడ్డి కారులో జహీరాబాద్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గురువారం మృతుడి తండ్రి సయ్యద్ జహీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## మైనర్‌ను ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న సిఐ ఉపేందర్

**సిద్దిపేట రూరల్, నవంబరు 13, ప్రభాతవార్త :** మైనర్‌ను ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. సిఐ కథనం ప్రకారం...సిద్దిపేట పట్టణంలోని కెసిఆర్‌నగర్ డబుల్‌బెడ్ రూంలలో నివాసముంటున్న ఎం.డి.సమీర్ (22) మైనర్ బాలిక ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులతో మీ కూతురును ప్రేమిస్తున్న, పెళ్లి చేసుకుంటా అని గొడవ చేయడంలో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.డి.అసిఫ్ కేసు నమోదు చేశారని తెలిపారు. సమీర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

**జగదేవ్‌పూర్, నవంబరు 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసులు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. తీగుల్ గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 25 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై అకస్మిక దాడులు నిర్వహించామని, అందులో భాగంగా 25 లీటర్ల మద్యం బెల్ట్ షాపుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు బెల్ట్ షాపులపై కేసులు నమెదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బెల్ట్ షాపులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బెల్ట్ షాపులో మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

# తాగునీటి సరఫరాలో అధికారుల వైఫల్యం

### రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉన్నా పంపిణీలో జాప్యం ఎందుకు..నీటిపారుదల శాఖ అధికారులపై ఎమ్మెల్యే అసహనం

**పటాన్‌చెరు, నవంబరు 13, ప్రభాతవార్త** మిషన్ భగీరథ పథకంద్వారా ప్రతి ఇంటికి రోజూ స్వచ్ఛ జలాలు అందించాల్సిన గ్రామీణ నీటి పారుదల విభాగం అధికారులు నీటి పంపిణీ అంశంలో ఘోరంగా విఫలం అవుతున్నారని ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలపరిధిలోని గ్రామాలకు మూడు నెలలకు ఒకసారి మంచినీరు సరఫరా అవుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం, లకడారం, ఇస్నాపూర్, పాశమైలారం,క్యాసారం, చిట్కుల్, తెల్లాపూర్ పరిధిలోని పోచారం, ఇంద్రేశం పరిధిలోని బచ్చుగూడ, ఇంద్రేశం, రామేశ్వరంబండ, పెద్ద కంజర్ల, చిన్నకంజర్ల, ఐనోలు, అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్, వడక్‌పల్లి, దాయర తదితర గ్రామాలకు రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు సక్రమంగా మంచి నీరు పంపిణీ కావడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనిషి జీవనానికి అత్యంత కీలకమైన తాగునీటిని అందించడంలో విఫలమైతే ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. సింగూరు, కాళేశ్వరం రిజర్వాయర్లలో మంచినీటి నిల్వలు సరిపడా ఉన్నప్పటికీ పంపిణీ అంశంలో ఎందుకు విఫలమైతున్నారని అధికారులను ప్రశ్నించారు.

ఇదే అంశంపై గతంలోనూ సమీక్ష సమావేశాలు నిర్వహించినా మార్పు రాకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు మూడు నెలలకు ఒకసారి మంచి నీరు విడుదల అవుతున్నాయని, ప్రజలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. పాశమైలారం పారిశ్రామిక వాడకు మాత్రం నిరాటంకంగా మంచినీరు సరఫరా అవుతున్నాయని, ప్రజలకు వచ్చేసరికి ఎందుకు నిరక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమకు నీళ్లు అందించడానికి తాము వ్యతిరేకించడం లేదని, ప్రథమ ప్రాధాన్యతగా ప్రజలకు అందించిన తర్వాతే మిగతా విభాగాలకు అందించాలని ఆయన అధికారులకు సూచించారు.

మంచినీటి పంపిణీ అంశంపై నిత్యం గ్రామీణ ప్రాంతాలు, కాలనీల ప్రజల నుండి వందలాది ఫిర్యాదులు తమకు అందు తున్నాయని, ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ బిందెలతో రహదారుల ఇబ్బందించే పరిస్థితులు తలెత్తకుండా తక్షణమే పంపిణీ అంశంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. నిధుల అంశంలో ఇబ్బందులు తలెత్తితే తనను నేరుగా సంప్రదించాలని, ప్రభుత్వంతోపాటు సిఎస్ఆర్ నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే జీఎంఆర్ అధికారులకు సూచించారు. రాబోయే వారం రోజులలో పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రతి గ్రామానికి నిర్దేశించిన విధంగా మంచి నీటిని సరఫరా చేయాలని సూచిం చారు.

సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, డీఈలు హరీష్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

## ఘనంగా సదర్ సయ్యాట సంబరాలు

**కొమురవెల్లి, నవంబరు 13, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో బుధవారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్‌సయ్యాట కార్యక్రమాన్ని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దున్నతోతులతో సదర్ సయ్యాట సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాదవకుల సంఘాలు, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు తర్వగా పూర్తి చేయాలి

**జనగామ డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

**కొమురవెల్లి, నవంబరు 13,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జనగామ డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం పరిశీలించారు. 50 గదుల ధర్మశాల, నూతన క్యూ కాంప్లెక్స్ తదితర పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను తర్వగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఆలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం



బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 13, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ శ్రీవాణి స్కూల్‌లో గురువారం ముందస్తుగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నెహ్రూ, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ఆకట్టుకున్నారు. 240 మంది విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.సత్యం మాట్లాడుతూ పాఠశాలలో 14 ఏళ్లనుంచి బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు అవసరం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు జానెట్

**జగదేవ్‌పూర్, నవంబరు 13 (ప్రభాతవార్త):** విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని సెయింట్ విన్సెంట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ జానెట్ అన్నారు. జగదేవ్‌పూర్ మండలం అలిరాజపేట గ్రామంలో సెయింట్ విన్సెంట్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అలీన, సిస్టర్ రేణు, సిస్టర్ మరియరోస్, పీఈటిలు శ్రీకాంత్, రమేష్, కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కోహెడ, నవంబరు 13, ప్రభాతవార్త :** శనిగరంలోని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులకు నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని బస్వాపూర్ సెక్షన్ ఏఈ మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో కోహెడ మండలంలోని శనిగరం ఫీడర్ బ్రేకర్ మెయింటనెన్స్ పనులు జరుగుతాయని, తంగళ్ళపల్లి, శనిగరం, గుండారెడ్డిపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 1నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 13, ప్రభాతవార్త :** ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సాహస్ స్వచ్ఛంద సేవా సంస్థ హుస్నాబాద్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఇటిక్యాల చిన్నా అన్నారు. గురువానం మండలంలోని పందిల్ల గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఇంట్లో ఉండే చెత్తను నాలుగు రకాలుగా విభజించుకోవాలని, తడి, పొడి, ప్లాస్టిక్ హానికరమైన, ఎలక్ట్రానిక్ లాంటి పరికరాలను వేరువేరుగా చేసి పంచాయతీ కార్మికులకు అందిచాలన్నారు. సేకరించిన తడి, పొడి చెత్తల ద్వార కంపోస్టు ఎరువులు తయారు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం వల్ల దాని నివారణ సాధ్యమౌతుందన్నారు. ఇళ్లల్లో జరిగే ఫంక్షన్లలో ప్రజలు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా స్టీల్ బ్యాంకులు వాడుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పందిల్ల, పొట్లపల్లి, కూచనపల్లి, గోవర్ధనగిరి గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందేలా చర్యలు తీసుకోవాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ టౌన్ నవంబరు 13, ప్రభాతవార్త:** ప్రస్తుత విద్యా సంవత్సరంలో షెడ్యూల్ కులాలకు సంబంధించి ఫ్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం పెండింగ్‌లోని రెన్యూవల్, నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని అడిటోరియంలో వసతి గృహాల సంక్షేమాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని విద్యార్థులకు స్కాలర్షిప్ల రూపంలో ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. చదువుకునే పేద పిల్లలకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు అండగా ఉంటాయని, డబ్బు సమస్య లేకుంటే విద్యార్థి చదువుపై ధ్యాస ఉంటుందని, చదువులో చక్కగా రాణిస్తారన్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలోని కళాశాలలో బయోమెట్రిక్ ద్వారా పూర్తి చేయాలని, ఈపాస్ లాగిన్‌లో విద్యార్థుల బ్యాంకు వివరాలు తప్పుగా నమోదైతే సరిచేయాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ధ్రువపత్రాలు అన్ని సిద్ధం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు ఉపకార వేతనాలకు నిధుల కొరత లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ జిల్లా విద్యాశాఖాధికారి విజయ, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల సంక్షేమాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




ఓవరాల్ ఛాంపియన్‌షిప్ బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

## సెయింట్ మేరీస్ పాఠశాలలో ముగిసిన క్రీడా పోటీలు

**గజ్వేల్, నవంబరు 13 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సిల్వర్‌జూబ్లీ కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ మెమోటంగ్ 18 ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ సిఐ రవికుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని, ఇలాంటి వేడుకలు విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం సెయింట్ మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ సెయింట్ మేరీస్ పాఠశాల ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటుచేసి 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. క్రీడా పోటీల్లో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభను కనబర్చిన సాయి జెడిఆర్ పాఠశాల విద్యార్థులకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల జిల్లా కార్యదర్శి సోమేశ్వర్‌రెడ్డి, సెయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపాల్ సుష్మ, యాదవరెడ్డి, థామస్ రెడ్డి, వివిధ పాఠశాలల పిఈటిలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభం



జల్లెడపట్టి తూకం చేస్తున్న సోయాబీన్

**కంగ్టి, నవంబరు 13 ప్రభాతవార్త :** కంగ్టిలోని మార్కెట్ కమిటీ గిడ్డంగిలో రైతుల నుంచి సోయా కొనుగోలు ప్రక్రియను గురువారం నాఫెడ్ అధికారులు కొనసాగించారు. గత వారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే తొలత రైతులకు టోకెన్లు జారీ చేశారు. అదే ప్రకారంగా క్రమ పద్ధతిలో ఇవాళ రైతుల నుంచి సోయాబీన్‌ను జల్లెడ చేసి నాఫెడ్ సూపర్వైజర్లు సాయి, రాజు, పీఏసీఎస్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధర రూ. 5328 ప్రకారం కొనుగోలు చేశారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన నగేష్ శెట్కార్

**మనూర్, నవంబరు 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పండరి పటేల్ సోదరుడు ఇటీవల మృతి చెందినట్లు తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ శెట్కార్ గురువారం మాజీ సర్పంచ్ నివాసానికి చేరుకుని పరామర్శించారు. నగేష్ శెట్కార్ వెంట నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్ తదితరులు ఉన్నారు.



మాజీ సర్పంచ్ పండరి పటేల్‌ను పరామర్శిస్తున్న నగేష్ శెట్కార్

## పోడు రైతులను పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

**-బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**రామచంద్రాపురం, నవంబరు 13, ప్రభాతవార్త:** పోడు రైతులు అరగోస పడుతున్నా కాంగ్రెస్ సర్కార్‌కు పట్టకపోవడం విడ్డూరంగా ఉందని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ఫారెస్ట్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని ధరఖాస్తులు అందచేసేందుకు వచ్చిన రైతులను అరెస్టు చేయడం తగునా అని ప్రశ్నించారు. 2 దశాబ్దాలుగా భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులపై ఫారెస్ట్ అధికారులు బెదిరింపులకు దిగడం తగదన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు పోడుభూములకు పక్కా పట్టాలిస్తామని కల్లబొల్లి కబుర్లుచెప్పి రైతులను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. పోడు రైతులకు న్యాయం జరిగే వరకు బిజెపి పోరాడుతుందన్నారు. ఫారెస్టు అధికారులు రైతులపై వేధింపులు ఆపాలని, అక్రమ అరెస్టులను పోలీసులు ఆపేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అంజిరెడ్డి హెచ్చరించారు.

**మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి...**

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. రైతుల నుంచి ప్రభుత్వం నేరుగా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల ఎకరాల్లో రైతులు మొక్క జొన్నల పంటను సాగుచేశారని, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ జిల్లాల పరిధిలో 3.20 లక్షల మంది రైతులు పంటను సాగుచేశారన్నారు. కౌలు రైతులు సైతం మొక్క జొన్నను సాగుచేశారని,అయితే క్రాప్ సర్వేలో పంట నమోదు కాలేదని మార్కెట్‌యార్డుకు తెచ్చిన మక్కలను కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళారులను రైతులు ఆశ్రయిస్తే ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మొక్కజొన్నకు కనీసం 2400 రూపాయల మద్దతు ధరను చెల్లించాలని, కౌలు రైతులు తెచ్చిన ధాన్యాన్ని సైతం కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం : మాజీ ఎంపిటిసి పాండు



సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎంపిటిసి పాండు

**సంగారెడ్డి, నవంబరు 13, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని పెద్దగోప్లారం మాజీ ఎంపిటీసి బి.పాండు అన్నారు. గురువారం మునిపల్లి గ్రామానికి చెందిన మేతరి మల్లమ్మకు రూ.60 వేలచెక్కును అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకరంతో పేదలకు సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరవుతున్నాయన్నారు.వైద్య ఖర్చులు తడిసి మోపడై భరించలేని వారికి ఈ నిధులు ఊరట నిస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమరేశ్వర్,ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు నరేంద్రచారి పాల్గొన్నారు.

## మహేశ్వర శర్మ సిద్ధాంతిని కలిసిన అయ్యప్ప స్వాములు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 13, ప్రభాతవార్త:** సంగారెడ్డి నుంచి అయ్యప్ప స్వాములు చేపట్టిన మహా పాదయాత్ర గురువారం తమిళనాడు రాష్ట్రంలోని వేదసందూర్ వద్ద జ్యోతిర్వాస్తు విద్యాపీఠ వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతిని కలిశారు. ఇప్పటివరకు 1250 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకున్న స్వాములను ఆయన అభినందించారు.ఇంకా 250 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకొని శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం పూర్తవుతుందని గురుస్వామి సాహితీ రాము తెలిపారు.



మహేశ్వర శర్మ సిద్ధాంతితో అయ్యప్ప స్వాములు

# మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానా

**గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి**

**గజ్వేల్/గజ్వేల్ టౌన్, నవంబరు 13 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి గురువారం గజ్వేల్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో ట్రాఫిక్ సిఐ మురళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ గజ్వేల్‌లో వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం తాగి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో 25 మంది వాహనదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారికి రూ.10వేల జరిమానా కోర్టులో విధించడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, ప్రతిఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండవసారి దొరికితే రూ.15వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నలుగురికి రూ.40వేల జరిమానా**

గజ్వేల్ పట్టణంలో కొన్ని రోజుల క్రితం వివిధ ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడపంతో వారిని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం తాగి ఉన్నట్లు రిపోర్టు రావడంతో గురువారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి నలుగురికి రూ.40వేల జరిమానా విధించినట్లు తెలిపారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ మురళి

**తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు**

తల్లిదండ్రులు వాహనాలను మైనర్ పిల్లలకు ఇవ్వవద్దని, మైనర్ డ్రైవింగ్ చట్ట ప్రకారం నేరమని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని మంజీరా కాన్సెప్ట్ హైస్కూల్ లో విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అందరూ తప్పనిసరిగా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ వివేక్

## అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : ఎస్ఐ

**నంగునూర్, నవంబరు 13, ప్రభాతవార్త :** అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్ సూచించారు. మండల పరిధిలోని బద్దిపడగ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లే సమయంలో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నంబరు 8712 667434, స్నేహిత మహిళ సపోర్టు సెంటర్ 9494639498, మహిళా పోలీసు స్టేషన్ 8712667435కు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.అనంతరం షీటీమ్ ప్రాముఖ్యత, నిర్వహించే విధులు,సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని పరిణామాలు, టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ దతితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుంచి రక్షణ పొందే అంశాలతోపాటు డిఫెన్స్, మహిళల,పిల్లల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు, షీటీమ్ ఎఎస్ఐ కిషన, కానిస్టేబుళ్లు ప్రవీణ్, రజిని, మమత, పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు**

**సిద్దిపేట అర్బన్, నవంబరు 13, ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో గురువారం మిట్టపల్లి సురభి సూపర్ స్పెషాలిటీ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ రియాజుద్దీన్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా మిట్టపల్లి సురభి మెడికల్ కాలేజీలో మెరుగైన వైద్య సేవలను అందిపుచ్చుకోవాలన్నారు. శిబిరంలో 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 130 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అపరేషన్ అవసరం ఉన్న వారిని ఆసుపత్రికి రెఫర్‌చేశారు. కార్యక్రమంలో వైద్యులు అబ్బాస్, జలపతి, బ్రహ్మం, పిఆర్ఓ వేణుగోపాల్, సచిన్, 60 మంది సీనియర్ డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, మార్కెటింగ్ బృందం, సపోర్టింగ్ స్టాప్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంక్ సేవలపై విద్యార్థులకు అవగాహన

**జగదేవ్‌పూర్, నవంబరు 13 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై డిసిసిబి బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ కె.నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగివుండాలని అన్నారు. సైబర్ సెక్యూరిటీ మోసాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని తెలిపారు. డిసిసిబి బ్యాంక్‌లో స్వర్ణనిధి డిపాజిట్ చేసి అధిక వడ్డీని పొందవచ్చని అన్నారు. బ్యాంక్ పనితీరు, ఖాతాలు, క్రమశిక్షణతో కూడిన పొదుపు, బ్యాంక్ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి అసిస్టెంట్ మేనేజర్ షేక్ సమద్, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 16 నుండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తరగతులు ప్రారంభం

**పటాన్‌చెరు, నవంబరు 13, ప్రభాతవార్త :** స్థానిక డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరులో 202526 విద్యా సంవత్సరానికి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తరగతులు ఈ నెల 16వ తేదీ ఆదివారం నుండి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, కో ఆర్డినేటర్ డాక్టర్ నోముల యోగిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గమనించి తరగతులకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కాలేజీలో ఓరియేంటేషన్ ప్రోగ్రాం ఉంటుందని అందరూ హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

## నేడు సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 13,,ప్రభాతవార్త:**

సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన నాలుగు వాహనాలు ఈనెల 14న గురువారం ఉదయం వేలం వేయడం జరుగుతుందని ఆసక్తిగల వారు పాల్గొన వచ్చని సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ ఎండి నజీర్ పాష ఒక ప్రకటనలో తెలిపారు.

## బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ (సీఐటీయూ) కన్వీనర్ అతిమేల మాణిక్**

**పటాన్‌చెరు, నవంబరు 13, ప్రభాతవార్త :** కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న బిస్లరీ వాటర్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్(సీఐటీయూ) కన్వీనర్ అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం పటాన్ చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోనీ బిస్లరీ వాటర్ పరిశ్రమ ముందు కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. కార్మికులు యూనియన్ పెట్టుకుంటే తొలగించడం చట్టానికి వ్యతిరేకమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న కార్మికులను సైతం యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆరోపించారు. కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్న యాజమాన్యంకు కార్మికులు యూనియన్ పెట్టుకుంటే ఏం ఇబ్బంది ఉందని ఆయన ప్రశ్నించారు. కార్మికుల శ్రమతో యాజమాన్యం కోట్లు గడిస్తు, కార్మికుల భద్రత సంక్షేమం గాలికి వదిలేయడం దారుణమన్నారు. కార్మికులు హక్కులు రక్షణ కోసం కార్మికులు ఏకం కావడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా యజమాన్యం దిగివచ్చి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా యజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిస్లరీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు నాగరాజు, కోశాధికారి నవీన్, సిఐటియు నాయకులు రాజు, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

## మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన

**కంగ్టి, నవంబర్ 13 ప్రభాతవార్త :**

మండలంలోని తడ్కల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మాక్ పోలింగ్‌ను ఎంఈఓ రహిమోద్దీన్ ప్రారంభించినరు, రానున్న రోజులలో ఎన్నికలు ఉన్నందుకు పెద్దఎనిమిది సంవత్సరం కలిగిన పై వారు ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు ను వేసుకోవాలని, విద్యార్థుల కు సూచించారు. వాటిలో భాగంగా గురువారం మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహనా కల్పించినారు. విద్యార్థులు ఉత్సాహంతో తమ ఓటును హక్కుగా భావించి వినియోగించారు. కార్యక్రమం ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అంజన, ఉపాధ్యయులు, అశోక్, శ్రీరాం, మని ప్రసాద్, యాదయ్య, సుదర్శన్, ఫర్జన, మాలతమ్మ సవిత, రసీద, విద్యార్థులు పాల్గొన్నారు.



మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## జానకి రఘునాథ పుష్కరిణి గుండం జాతర



జానకమ్మ, రఘునాథ గుండం

**సదాశివపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
జానకమ్మ రఘునాథస్వామివారల ఆరాధనోత్సవము సిద్ధరాజ ప్రభు పుత్రుడు జ్ఞానరాజు మహారాజు ప్రభుసంస్థాన్‌లచే జరుపబడుచున్నది. బాలమార్తండసర్వతోముఖ యాగ్‌జిమహారాజు మార్గదర్శకత్వంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించబడతాయని నరసింహారావు కులకర్ణి తెలిపారు. శుక్రవారం పల్లకీసేవ ఊరేగింపు శనివారం బాలమార్తాండ సర్వతోముఖ యాగ్‌జి సమక్షంలో హరికథా కాలక్షేపము, ఆదివారం రుద్రాభిషేకము, భజనకార్యక్రమం, మహాప్రసాద్వితరణ, సాయంత్రం అగ్ని గుండము, గోపాలకాల హారతులు, ఫలక్షేమ ఊరేగింపుతో ఉత్సవాలు ముగించబడతాయని తెలిపారు. ఉత్సవంలో సదాశివపేట పట్టణం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సిపిఐ బహిరంగసభ పోస్టర్ విడుదల

**సదాశివపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
ఖమ్మంలో జరిగే బహిరంగసభను సదాశివపేట మండల ప్రాంతం నుండి అధికసంఖ్యలో పార్టీశ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని గురువారం డిసెంబరు 26న జరిగే మహాసభకు సంబంధించిన పోస్టరును విడుదల చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎన్టీసి మండల కార్యదర్శి మాట్లాడుతూ 100సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగసభను దిగ్విజయం చేయడానికి రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుందని ఈమహాసభకు దేశం నలుమూలల నుండి కాకుండా 40 దేశాల నుండి ప్రతినిధులు విచ్చేస్తున్నారన్నారు. ఇంతటి మహత్తరచరిత్ర కలిగిన మహాసభకు సదాశివపేటమండలం నుండి కార్మికవర్గం, కర్షకవర్గం పెద్ద ఎత్తున పాల్గొని సభను జయప్రదంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం.గంగమ్మ, బుజ్జమ్మ, ఇన్చార్జి సాధకలి, పాషా, గౌస్‌పాషా, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబిలో పొదుపుచేస్తే అత్యధిక వడ్డీ



మాట్లాడుతున్న దీపక్‌కుమార్

**పాపన్నపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపుచేస్తే అత్యధిక వడ్డీని పొందవచ్చునని బ్రాంచ్ మేనేజర్ దీపక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో డిసిసిబిబ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసిసిబి నూతనంగా ప్రవేశపెట్టిన స్వర్ణనిధి డిపాజిట్ ద్వారా 444రోజులకుగాను అత్యధికంగా 8.25శాతం వడ్డీని పొందవచ్చున్నారు. డిపాజిట్లపై డిఐసి జిసి ఇన్సూరెన్స్ సదుపాయంతోపాటు యుపిఐ, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంక్‌గ్యారంటీ, ఎటిఎం, లాకరు సౌకర్యాన్ని ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. అతితక్కువ వడ్డీకి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతోపాటు బంగారు ఆభరణాలపై అత్యధికంగా గ్రాముకి రూ.7400 రుణాన్ని అందిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి
**-జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య**



పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డిపిఓ

**పెద్దశంకరంపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అనంతరం గ్రామకార్యదర్శులతో సమావేశం నిర్వహించి, పలు ఫిర్యాదులపై విచారణచేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతం, పన్నుల వసూలు, శానిటేషన్, నూతన గృహాలకు అనుమతులపై సూచనలు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీస్థలాలను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎల్పిఓ సురేష్‌బాబు, ఎంపిడిఓ షాకీర్‌అలీ, ఎంపిఓ క్రాంతికుమార్, గ్రామకార్యదర్శి వెంకటరాములు ఉన్నారు.

## కపాస్ కిసాన్ యాప్ పత్తి విక్రయం
**-మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ**



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నాగం కృష్ణ

**పెద్దశంకరంపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
రైతులు పండించిన పత్తిపంటను కపాస్ కిసాన్ యాప్‌ద్వారానే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని టెక్మటి గ్రామంలో పత్తిరైతులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ మొబైల్‌లో ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని స్లాట్‌ను బుక్ చేసుకోవాలి అనగా ఏతేదీన ఎంతపత్తిని ఏసెంటరుకు తీసుకెళ్తామో నమోదు చేసుకుని ఆతేదీనే నమోదు చేసుకున్న సెంటరుకు పత్తిని తీసుకెళ్లాలని తెలిపారు. ఈ యాప్‌ను ఉపయోగిస్తే రైతులకు రాత్రింబవళ్లు మిల్లులవద్ద ఎదురుచూడాల్సిన అవసరం ఉండదన్నారు. పత్తి తేమశాతం 8నుండి 12శాతం మధ్యలో ఉంచి నాణ్యమైన పత్తిని మార్కెటుకు తీసుకువస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వినీత్, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు ఉండకూడదు
**-ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సదాశివపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
సదాశివపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లుచేసి, చివరి గింజ వరకు కొనుగోలుచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి రైతు చెమటతో పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అకాలవర్షాలతో ఇబ్బందిపడుతున్న రైతులు, ఇంకా ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల్లో తగినంత గన్ని బ్యాగులు, బరువులు, గోడౌన్ సౌకర్యాలు, తూకం పరికరాలు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొలత, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియల్లో పారదర్శకత తప్పనిసరిగా పాటించాలని, రైతులను ఎక్కడా ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. చెల్లింపులు ఆలస్యంకాకుండా బ్యాంకులతో సమన్వయంచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పాండు నాయక్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ సుధీర్‌రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి చైర్మన్ అమరేందర్ రెడ్డి, మండల పట్టణపార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, చిలమల్లన్న, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్, అగ్రికల్చర్ ఏవో రమేష్, ఏఈఓ శ్రీదేవి, కౌన్సిలర్లు పిల్లోడి వీరేశం, సమీ, మాజీ ఎంపిటిసిలు సుధాకర్, అహ్మద్, రవి, శివకుమార్, అశోక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, నవీన్, నరేష్‌గౌడ్, దశరథ్, సంగన్న, మానయ్య, చంద్రన్న, సళావుద్దీన్, సిద్దన్న, నల్లోల్ల కుమార్, శేఖర్, రాములు, నాయకులు నగేష్ కురుమ, రాజశేఖర్ రెడ్డి, శ్రీరాములుగౌడ్, గోపాల్‌రెడ్డి, శంభుప్రసాద్, శ్రీశైలం, తొంటరాజు, అక్షయ్, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.

## తూకంవేసిన వెంటనే ధాన్యం మిల్లులకు..



కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న కరుణాకర్

**పాపన్నపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
తూకంవేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని మెదక్ జిల్లా సహకారశాఖ అధికారి కరుణాకర్ ఆదేశించారు. గురువారం పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించి ధాన్యంలో తాళ్ళు, పొల్లు లేకుండా చూసుకోవాలని, తేమశాతం ఎక్కువలేకుండా చూడాలని, తూకంవేసిన ధాన్యం నిల్వచేయకుండా మిల్లులకు తరలించి ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీచేసి ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో వారి ఖాతాలలో జమ అయ్యేవిధంగా కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట అసిస్టెంట్ రిజిస్ట్రర్ శ్రీనివాస్, సంఘం సిఈవో వెంకటేశ్వర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు తదితరులు ఉన్నారు.

## జీవన్ముక్త మహారాజ్ జాతర



జీవన్ముక్త మహారాజ్ సంస్థానం

**మునిపల్లి, నవంబరు 13, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలంలోని అంతారంలో నేటి నుండి జీవన్ముక్త మహారాజ్ జాతర జరుగనున్నట్టు అంతారంసంస్థాన్ జ్ఞానేశ్వర్‌మహారాజ్ తెలిపారు. శుక్రవారం శిఖరస్థాపన, శనివారం గరుడవాహనం, 16న మహాపూజ, 17న గోపాళవాల, 18న రథోత్సవం, మరుసటి జాతరకార్యక్రమాలు వుంటాయని ఆయన తెలిపారు. కర్నాటక, మహారాష్ట్రలతోపాటు తెలంగాణలోని వివిధ జిల్లాలు, మండలాల నుంచి ఈజాతరకు భక్తుల హాజరవుతారన్నారు. కంకోల్, సదాశివపేటల నుండి అంతారంకు బస్సు, ఆటోసౌకర్యం వుంటుందని జ్ఞానేశ్వర్‌మహారాజ్ అన్నారు.

## పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

**నారాయణఖేడ్, నవంబరు 13, ప్రభాతవార్త:**
తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సంగారెడ్డిమెదక్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 16.11.2025, ఆదివారం ఉదయం 10.00గంటలకు సంగారెడ్డిపట్టణంలో రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ అధికారుల భవనంలో జరుపబడుతాయని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సంగారెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ తెలిపారు. ఎన్నికల అధికారిగా మామిడాల రవికుమార్ (తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి) ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. గత కార్యవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నందున కొత్త కార్యవర్గాన్ని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సంగారెడ్డి, మెదక్ జిల్లాల సభ్యులు ఆదివారం జరిగే ఎన్నికలలో ఎన్నుకోవడం జరుగుతుందని, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పదవులతోపాటు మొత్తం 23పదవులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం తీసుకున్న సభ్యులు మాత్రమే పోటీచేయటానికి అర్హులు. కావున సభ్యత్వం తీసుకొన్న సభ్యులు అందరు ఈ ఎన్నికల కార్యక్రమానికి హాజరు కావాలని భాస్కర్ కోరారు.

## రోడ్డు ధ్వంసం అయిందని ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న దసపల్లి గ్రామస్థులు

**మనూర్, నవంబరు 13, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని దోసపల్లి గ్రామం నుంచి టిప్పర్ లారీలు ఎక్కువగా తిరిగాడుతుండటంతో గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని గ్రామస్థులు గురువారం ఆందోళనకు పూనుకున్నారు. అటుగా వచ్చిన టిప్పర్ లారీలను అడ్డుకుని నిరసన వ్యక్తంచేశారు. రోడ్డుపై మట్టి మొరంవేసి రోడ్డుపై ప్రయాణించేందుకు అవకాశంలేకుండా చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు కాంట్రాక్టర్ తరపున కొందరు వచ్చి గ్రామస్థులకు నచ్చచెప్పే యత్నం చేశారు. డాంబర్‌వేస్తేనే తమ గ్రామం నుంచి లారీలను తిరుగనిస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.

## రిజర్వేషన్ల కోసం ధర్మపోరాట దీక్ష




ధర్మపోరాట దీక్షలో పాల్గొన్న బిసి జెఎసి నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 13, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో అన్నిస్థాయిల్లో వెనుకబడిన తరగతులకు 42శాతం రాజకీయ, విద్య, ఉద్యోగరంగాలలో రిజర్వేషన్‌లు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రకమిటీ పిలుపుమేరకు బిసి జెఎసి, సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఇది సామాజికన్యాయం కోసం చేస్తున్న ఆత్మగౌరవ పోరాటం అని జిల్లా చైర్మన్ ప్రభుగౌడ్, వైస్‌చైర్మన్ గోరుగంటి రమేష్‌కుమార్‌కురుమ అన్నారు. దీక్ష కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్‌కురుమ సంగారెడ్డి జిల్లా బిసి జాక్ చైర్మన్ ప్రభుగౌడ్ ముఖ్య సలహాదారులు అశోక్‌కుమార్ వర్కింగ్ చైర్మన్ గోకుల్‌కృష్ణ, వైస్‌చైర్మన్ గోరుగంటి రమేష్‌కుమార్‌కురుమ యువజన సంఘాల అధ్యక్షులు కూన వేణు, జిల్లాకన్వీనర్లు పట్లోళ్ల మల్లికార్జున్‌పాటిల్, వి.లింగయ్య, ఆర్.లక్ష్మి, కోకన్వీనర్లు సులగంటి సిద్దేశ్వర, ఎ.మానస, జగదీష్, పాండురంగం, రవి, గోపాల్, సుదర్శన్‌గౌడ్, రమేష్‌గౌడ్, గీతకార్మికసంఘ అధ్యక్షులు జంగన్నగౌడ్, గీతకార్మికసంఘం శృతి, మంగగౌడ్, వడ్ల లత, విశ్వపతి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

**చిలిపిచేడ్, నవంబరు 13, ప్రభాతవార్త:**
పేదప్రజలకు ఆర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబాన్ని ఆదుకునేందుకే సిఎంఆర్‌ఎఫ్ పథకాన్ని చేపట్టిందని మండల బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. చిలిపిచేడ్ మండలపరిధిలోని చండూర్ గ్రామానికి చెందిన ఎరుకల భాగ్యలక్ష్మికి సిఎంఆర్‌ఎఫ్ 27000 రూపాయల చెక్కును మండల బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ముందస్తు సహాయనిధులతో ఎలాంటి ఇబ్బందిలేకుండా ఆస్పత్రిలో చికిత్స చేసుకోవాలని బాధిత కుటుంబసభ్యులకు సూచించారు. అనారోగ్యానికి గురై ఆర్థికస్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభ్యాగులకు అండగా సిఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నరేందర్‌రెడ్డి, కాసిం, జయరాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రేశం రహదారికి మరమ్మతులు
**-అతిత్వరలో పూర్తిస్థాయిలో రహదారి విస్తరణ, నిర్మాణం**
**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



రోడ్డు విస్తరణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, నవంబరు 13, ప్రభాతవార్త:**
శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా పెద్దకంజర్ల వరకుగల ప్రజలకు మెరుగైన రవాణాసౌకర్యం అందించేందుకు అతి త్వరలో హెచ్‌ఎండిఏ ద్వారా రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు పరిధిలోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు నుండి ఇంద్రేశం మీదుగా పెద్దకంజర్ల వరకు 60లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న బిటి రోడ్ ప్యాచ్ వర్క్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గకేంద్రమైన పటాన్‌చెరు పట్టణానికి ఇంద్రేశంతో పాటు, రామేశ్వరంబండ, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, ఐనోలు, బచ్చుగూడెం, పోచారంతోపాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈరహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్దకంజర్ల వరకు 22కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనులకోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన విధులకేటాయింపు రద్దుకావడం మూలంగా, తిరిగి రహదారి వరమ్మతులుచేపట్టారని ప్రస్తుతప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో రహదారి విస్తరణ పనులు సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బిటి ప్యాచ్ వర్క్ పనులు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఏఈ చంద్రశేఖర్, ట్రాఫిక్ సిఐ లాలునాయక్, మాజీ ప్రజాప్రతినిధులు అంతిరెడ్డి, బండి శంకర్, దుర్గారెడ్డి, రామచందర్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల పంచాయతీ అధికారి నియామకం



శ్రీశైలంను సన్మానిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
మండల పంచాయతీ అధికారిగా అంకం శ్రీశైలం నియామకం అయ్యారు. ప్రభుత్వం వెలువరించిన గ్రూప్2 ఫలితాల్లో మండలపరిషత్ కార్యాలయాలలో ఉన్న ఖాళీల భర్తీలో భాగంగా ఎంపిఓలను నియమించాలని మెదక్ జిల్లాకు అంకం శ్రీశైలంను కేటాయించడంతో, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పాపన్నపేటకు ఎంపిఈఓగా నియమించడంతో, గురువారం మండలపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి పాటుపడుతూ, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయికి చేరవేసేందుకు కృషి చేస్తానని, గ్రామస్థాయిలో సుస్థిరపాలన కొనసాగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి డిఎల్ పిఓ సురేష్ బాబు, ఎంపిడిఓ విష్ణువర్ధన్‌లు అభినందనలు తెలిపారు.

## ఖో-ఖో పోటీల్లో చౌటకూరు విద్యార్థుల ప్రతిభ



ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చాటిన చౌటకూరు విద్యార్థులు

**చౌటకూరు, నవంబరు 13, ప్రభాతవార్త:**
జిల్లాస్థాయి ఖో-ఖో పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మైదానంలో ఖో-ఖో పోటీలు గత రెండురోజులుగా నిర్వహించారు. ఎస్‌జిఎఫ్ విభాగంలో అండర్14, అండర్17 విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. అండర్14 మహిళల విభాగంలో యోధులు మొదటిస్థానం కైవసం చేసుకుంది. అండర్17 బాలుర విభాగంలో మండల కేంద్రమైన చౌటకూరులోని జడ్పిహెచ్‌ఎస్ విద్యార్థులు చాంపియన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయులు, పిఈటిలు అరుణ, పోషకులు, తోటివిద్యార్థులు ప్రత్యేకంగా అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ ప్రతిభను మరోమారు చాటాలని కాంక్షించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంచేయాలి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

**మనూర్, నవంబరు 13, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఎంపిడిఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శల్గిర, తిమ్మాపూర్, దుదుగొండ, రాణాపూర్, మాయికోడ్ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపిడిఓ పరిశీలించారు. మండలంలో 324మందికి ఇళ్లు మంజూరుకాగా, 227మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారని, నిర్మాణం ప్రారంభంకాని 97మంది వెంటనే ఇంటినిర్మాణానికి శ్రీకారంచుట్టాలన్నారు. ఇళ్లనిర్మాణం ప్రారంభించిన 168మందికి బిల్లులు సైతం అందచేశామన్నారు. కార్యక్రమంలో ఏపిఓ షాహిద్, గ్రామస్థులు కమ్మరి బుద్యన్న, ప్రవీణ్, రాజిరెడ్డి ఉన్నారు.

## వేలిముద్రలు రాక రైతుల ఇబ్బందులు..

**కంగ్టి, నవంబరు 13, ప్రభాతవార్త:**
కంగ్టిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలు ప్రారంభమయ్యాయి. అయితే సోయాపంట ప్రభుత్వానికి విక్రయించాలంటే ముందస్తుగా తీసుకోవాల్సిన టోకెన్ కోసం పట్టాదారు రైతు వేలిముద్ర ద్వారా టోకెన్లు జారీ చేస్తున్నారు. అయితే వేలిముద్రలు పడక, టోకెన్లు ఇవ్వడంలేదని ఆయా గ్రామాలకు చెందిన రైతులు వాపోయారు. 30 క్వింటాళ్ల సోయా పండిందని, టోకెన్ లేక మద్దతుధర కోల్పోవాల్సి వస్తుందని రైతులు వాపోయారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని న్యాయంచేయాలని దెగులవాడి చందర్ తాండకుచెందిన వాలుబాయి తదితరులు కోరారు.

## వియత్నాంలో ఎఐ శిక్షణ
**-వియెన్‌డాంగ్ కళాశాలలో రెండువారాల కార్యశాల నిర్వహణ**



వియత్నాం శిక్షణ శిబిరంలో గీతం అధ్యాపకుడు

**పటాన్‌చెరు, నవంబరు 13, ప్రభాతవార్త:**
గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాదులోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి వియత్నాంలోని హోచిమిన్ నగరంలో అంతర్జాతీయ విద్యా శిక్షణకు వెళ్లారు. ఆయన నవంబరు 10నుంచి 22వరకు వియెన్‌డాంగ్ కళాశాలలో కృత్రిమమేధస్సు (ఎఐ) బిల్డర్ బ్యూట్ క్యాంప్ చేయడం ద్వారా నేర్చుకోండి, ఆలోచించడం ద్వారా నిర్మించండి అనే ఆచరణాత్మక కార్యశాలను నిర్వహిస్తున్నారు. దాదాపు 26ఏళ్ల బోధనానుభవంతో, డాక్టర్ నిరంజన్ గతంలో వియెన్‌డాంగ్ కళాశాలలో జావా, ఫ్లట్టర్‌లలో ఆచరణాత్మక శిక్షణతోపాటు కృత్రిమమేధస్సుపై ఆతిథ్య ఉపన్యాసాలు ఇచ్చారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**పెద్దశంకరంపేట, నవంబరు 13, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేట మండలపరిధిలో నలుగురు లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పంపిణీచేశారు. పట్టణానికి చెందిన కమ్మరి సాత్వికరాజేష్‌కు రూ.12000 చెక్కును, లలితకు రూ.17,500 చెక్కును, మండలపరిధిలోని విరోజిపల్లిగ్రామానికి చెందిన దేగావత్ భాస్కర్‌కు రూ.13000 చెక్కును, సిరిగాపురం పద్మకు రూ.21000 చెక్కును అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జంగం శ్రీనివాస్ బిఆర్‌ఎస్ నాయకులు సురేష్‌గౌడ్, దత్తు, రవీందర్, సుభాష్, శంకర్‌గౌడ్, విట్టల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.